# తార-చీర




ఇచ్ఛాపురపు రామచంద్రం

సినీ తార సితార - వార్డ్ రోబ్ ముందు నిశ్చేష్టురాలై నిలబడి ఉంది. ఆమె - రెప్ప వేయకుండా చీరెల వేపే చూస్తూ బొమ్మలా ఉండి పోయింది. నిజానికి సితార బొమ్మ కంటే కూడా అందమయిన అమ్మాయి. సుదీర్ఘమూ, గంభీరమూ అయిన ఆలోచనలలో మునిగినట్లు ఆమె చీరెల బీరువాకే గుడ్లప్పగించి ఉండి పోయింది. స్టిల్ ఫొటోగ్రాఫర్‌కి పోజిచ్చేందుకు కెమేరా ముందు నిలబడినట్లు ఆ చీరెల ముందు అలా నిశ్చలంగా ఎంత సేపో ఉండిపోయింది...!

"ఎవరు?" ఉలిక్కిపడిం దామె.

ఎవరో - వెనక నుంచి ఆమె కళ్ళు మూశారు.

"చెప్పుకో. చెప్పుకుంటేనే చేతులు తీస్తాను."

"చరిత!"

"గుడ్!" చేతులు తీసేసి... అంతలోనే ఏదో అనుమానం వచ్చినట్లు తన వేళ్ళ చివరలు చూసుకుని కంగారుగా, ఆత్రంగా "సితారా! నువ్వు ఏడుస్తున్నావా!" అంది చరిత నమ్మలేనట్లు.

"లేదు, లేదు." తడబడుతూ నవ్వబోయింది సితార. అది నటనే అని విఫలమైన ఆమె ప్రయత్నమే చెప్పేసింది.

"నీ ముఖం నిండా ఏదో బాధ... ఏమిటో వ్యథ... సితారా! నువ్వు ఎంత దాచుకుందామనుకున్నా నీ మనసులోని దిగులు కళ్ళల్లో దాగడం లేదు. నువ్వు నటించీ ప్రయోజనం ఉండదు. సినీ జీవితంలోనే కానీ నిజ జీవితంలో పేకులుండవు. అయినా స్నేహితురాలిని, ఆప్తురాలిని, ఆత్మీయురాలిని నాకు కూడా చెప్పుకోలేని కష్టమా? ఏమిటి? ఆశించిన పిక్చరు ఫ్లాప్ అయిందా అట్టర్‌గా?"

"ఊహుఁ."

"పోటీగా మరెవరేనా...?"

"ఛ, ఛ."

"సినీ తారవైన నీకేం కష్టాలుంటాయి? కొంప తీసి ప్రేమలో కాని పడలేదు కదా?"

లేదన్నట్లు భారంగా నవ్వింది సితార పేలవంగా.

చరిత చూపుతున్న ఆప్యాయత కామె అప్పటికే కరిగిపోయింది. ఎంత వద్దనుకుంటున్నా ఆమె బీరువాలోని చీరెల మీద నుంచి దృష్టిని మాత్రం మరల్చుకోలేకపోతూంది. అది గమనించి, "ఏదయినా చీరె పోయిందా, వార్డ్ రోబ్‌లోంచి?" అని అడిగింది చరిత.

"లేదు." నిర్లిప్తంగా చెప్పింది సితార.

"రోజూ ఒక కొత్త చీరె కొనడమనే నీ వ్రతం సక్రమంగానే సాగుతూందిగా? రాజు తలుచుకుంటే దెబ్బలకి కొదువా అని నీలాటి తార తలుచుకోవాలే కాని రోజు కొకటేమిటి, గంట కో చీరె కొనగలవు."

"రోజూ కొత్త చీరె తెస్తూనే ఉన్నాను. ఇవాళ..." అంటూ లేచి బీరువాలో 365 అంకె వేయబడిన హుక్ నుంచి కొత్త చీరెను తీసి చూడమన్నట్లు చరిత కందించింది.

"అద్భుతంగా ఉంది. ఈ చీరెలో నువ్వెంత అందంగా ఉంటావో! ఒక్కసారి చూడాలనుంది. ఎప్పుడు కట్టుకుంటావ్?" సితార కళ్ళల్లోకి నిండుగా నీళ్ళొచ్చేశా యొక్కసారి.

"అదే... ఎప్పుడు కట్టుకోను? ఎవరి ముందు ... ఎవరి కోసం కట్టుకోను?" దుఃఖం ఆపుకోలేక చరిత భుజం మీదకు తల వాల్చేసింది సితార.

ఒక క్షణం - చరిత కేమీ అర్థం కాలేదు. సితారకి కష్టమూ, కన్నీళ్ళూనా? అసంభవం...!

"సితారా!... ఏమిటిది?" అయోమయంగా ... జాలిగా చూస్తూ ఆమె బాబ్డ్ హెయిర్‌ని నిమిరింది చరిత.

"నా మనసు, బాధ నీకు తెలియవు. నీకే కాదు, ఎవరికీ..." వెక్కి వెక్కి ఏడవసాగింది.

"చెప్పు... తెలుసుకుంటాను-" అలా అనడానికి చరితకి సిగ్గు వేయకపోలేదు. సితారకు తను ఎంతో స్నేహితురాలై ఉండీ ఆమె బాధేమిటో, ఎందుకో తెలుసుకోలేకపోయిందంటే ఎంత సిగ్గు! స్నేహాని కింత ద్రోహం!!

సితార - కృత్యాద్యవస్థలో ఉన్నట్లు మౌనంగా ఉండిపోయింది.

"నువ్వు - సామాన్యురాలివి కావు సితారా! చలన చిత్ర ప్రేక్షకుల స్వప్న సుందరివి. సినీ జన రసిక శిఖామణులకు ఆరాధ్య దేవతవూ, అందాల రతివీ. నీ ఒళ్ళే వలపు. నీ ఒంటి ఒంపే ఒయ్యారం..."

"అదేమో కాని... నేను - సెక్స్ బాంబ్‌ని. నా కళ్ళ నిండా కైపు. నా ఒంటి నిండా... ఒంటి ఒంపుల నిండా ప్రేక్షకులని వెర్రెక్కించే ఒయ్యారం. నా శరీరంలో అంగాంగమూ ప్రేక్షకుల పాలిటి వలే, సమ్మోహనాస్త్రమే! అందుకే దర్శకులు నన్ను కెమెరా ముందుకి తోసేటప్పుడు నా ఒంటి మీద బట్ట ఉండనివ్వరు - అత్యవసరమైన మేరకు తప్ప. అదీ - సెన్సారు కత్తెరకి జడిసి..."

"అందుకు విచారిస్తున్నావా?" ఆశ్చర్యంగా చూసింది చరిత.

"నీ కెందరు అభిమానులని! అందరి అభిమానం సంపాదించుకోగలగడం - ఎంత అదృష్టం!" చరిత మనసులో నిజంగా ఈర్ష్యపడకపోయినా ఆమె కంఠం అలాగే ధ్వనించింది. సితార పేలవంగా నవ్వింది. "ఔను... నా కెందరో అభిమానులు. నాకు ఉత్తరాలు రాస్తూ - పత్రికా ముఖంగా నన్నారాధించే వారెందరో ప్రేక్షకులు. వారి అభిమానానికి సంతోషమే, కాని, వారి అభీష్టం, అభ్యర్థన, ఆజ్ఞలు - వాటితోనే వస్తూం దసలు చిక్కంతా."

"ఏమిటి?"

"ముందు - నన్నొక మాట చెప్పనీ."

"చెప్పు. నువ్వేం చెప్పినా వినడానికి నేను సిద్ధమే."

"నేను సినీ తార నెందుకయ్యానో తెలుసా?"

"డాక్టరు కాబోయి యాక్టరువయ్యావా?" నవ్వింది.

"ఉహుఁ. నేను టెన్త్ కూడా మొదటి ఛాన్స్‌లో పాసవలేకపోయాను. డాక్టర్నెలా కాగలను? మొదట - మద్రాసు వచ్చినప్పుడు - నేను చాలా మందిలా హీరోయిన్‌ని కావాలని కలలు కనలేదు-"

"అదేమిటి? కీర్తి ... డబ్బు... అన్నీ కదా హీరోయినంటే?"

"నేను కోరుకున్నది హీరోయిన్ కావాలనీ కాదు, కీర్తీ, అపరిమితమైన ఐశ్వర్యమూ అసలే కావు."

"మరి?" విచిత్రంగా చూసింది.

"నేను - దుర్భర దారిద్ర్యంలో బ్రతికేదాన్ని నాటకాలలో వేషాలు వేస్తూ. నాటకాలలో ఎంత పెద్ద పాత్రయినా సినిమాలలో అతి చిన్న వేషానికి కూడా సరిరాదు ఆర్థికంగా."

"ఔను."

"నాకొక బలమైన కోరిక ఉండేది. స్త్రీని కావడం వల్ల కాబోలు - ఆ అతి విచిత్రమయిన కోరిక..."

"ఏమిటది?"

"చీరెలు!... ఎప్పటి కప్పుడు కొత్త చీరెలు కట్టుకోవాలని."

"ఆడదాని కా కోరిక అసహజం ఏమీ కాదు, అతి సహజమే."

"నే సందంగా ఉంటానని అర్ధ నగ్న వేషాలకు తీసుకుంటామన్నారు. నేనెందుకు కాదనలేదో తెలుసా? ఆ వేషాలకు వచ్చే డబ్బు కూడా తక్కువేమీ కాదు. మిగిలిన అవసరాలు తీరగా నాకు కావలసినన్ని కొత్త చీరెలు కొనుక్కుంటూ ఉండవచ్చు. శ్రీవారికి రోజూ కొత్త చీరెలో కనపడుతూండవచ్చు అనుకున్నాను. ఆశపడ్డాను."

"ఆశించిన మేరకంటే ఎక్కువే సాధించావుగా? సెక్స్ బాంబ్ అనే బిరుదు లభించింది. నీకు పోటీ లేదు. ఒక్కో డాన్సుకి చాలా ఇస్తున్నారు నిర్మాతలు. హీరోయిన్లతో సమానంగా ఫాన్ మెయిల్ వస్తూంది. ఇంకేం కావాలి?"

"ఏమీ అక్కరలేదు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అని నా బాధ మాత్రం అలాగే మిగిలి ఉండిపోయింది." విచారం నిండింది సితార కంఠంలో.

"ఏమి టా శని?" కుతూహలంగా అడిగింది చరిత.


"ప్రేక్షకుల అభిమానంలో అంతర్గతంగా ఉండే హెచ్చరికలూ, ఆజ్ఞలూ. నిర్మాతలు నాకు వేల కొద్దీ రూపాయలిస్తూ కంట్రాక్టు ఫారం మీద సంతకం పెట్టించుకునే ముందు విధించే ఆంక్షలు..."

"సితారా! నీ మాటలు నా కర్థం కావడం లేదు..."

"చెప్పుకుందుకు కూడా సిగ్గుగా ఉంది. అయినా చెబుతాను, తప్పదు కనుక.

ప్రేక్షకులకు నా మీద ఎంత వెర్రంటే 'మై డియర్ సెక్స్ బాంబ్! మీ సౌందర్యం వెన్నెల లాంటిది. చందమామ లాంటిది. ఆ చందమామను మబ్బులూ, మీ శరీరాన్ని బట్టలూ కప్పెయ్యకూడదు. కెమెరా ముందు ఎలా అర్ధ నగ్నంగా



ఉంటారో బయట కూడా మీ రలాగే ఉండాలి... లేకపోతే...' అంటూ రాస్తారు."

"హారి భగవంతుడా! వీళ్ళ వెర్రి బంగారం కానూ!

"మీరు బట్టల విషయంలో పేచీలు పెట్టకూడదు. ఎలా చెబితే అలా వినాలి మరి... అంటారు నిర్మాతలు అడ్వాన్సిస్తూ... అంటే - నేను సాధ్యమయినంత నగ్నంగా కనిపించాలన్న మాట!

చరితా! నీకు తెలును - సినీ తారల గ్లామరెంత నున్నితమూ, క్షణికమూ అయిన నీటి బుడగో! ఇవాళ అందలమెక్కిస్తున్న ప్రేక్షక నిర్మాతలే కొంచెం తేడా వచ్చిందంటే చాలు - రేపు నన్ను అధఃపాతాళానికి అణగత్రొక్కెయ్యగలరు. అందుకే వారి ఆజ్ఞా గీతాల కనుగుణంగా నేను నాట్యం చేయాలి - ఇలా మిగలాలంటే. ప్రేక్షక, నిర్మాతలు నా పై మరొక అతి దారుణమైన ఆంక్ష కూడా విధించారు." భారంగా చెప్పింది సితార.

"ఏమిటి?"

"మామూలుగా - బయటి ప్రపంచంలో - స్త్రీకి వివాహంతో స్టేటస్ పెరుగుతుంది. సినిమా ప్రపంచంలో... ముఖ్యంగా నీలాటి. సెక్స్ బాంబులకి - పెళ్ళైతే గ్లామర్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందొక్కసారిగా. అందుకని నా నిర్మాతలు తమ పిక్చర్లు పూర్తయ్యేలోపున పెళ్ళి చేసుకోకూడదంటారు. ప్రేక్షకులు కూడా నేను పెళ్ళి చేసుకుని ఏ ఒక్కడికో చెందకుండా, పెళ్ళి చేసుకోకుండా అందరి దానిగా మిగలాలని శాసిస్తూంటారు..."

ఈ నిజాలు చెబుతూంటే సితార దుఃఖం మరీ పెరిగి పోయింది. చరిత ఆమె సౌదార్యాలన్న విషయం కూడా విస్మరించి తెల్లబోతూ వెర్రి మొహం వేసి ఉండి పోయింది.

"చీరెలు కొనగలను... కాని - కట్టుకోలేను." - ఎంత దురదృష్టం! ఎంత దౌర్భాగ్యం!

"అది కాదు ... కెమెరా ముందూ, స్టూడియోలలోనూ మినీ డ్రెస్సుల్లో ఉండి, బయట..." ఏదో చెప్పబోయింది చరిత.

"నీకు తెలును - తారలకు ప్రైవసీ తక్కువ. నేను చీరె కట్టుకుని ఏ విలేఖరి కంటో పడ్డానో... కెమెరా టక్కున క్లిక్‌మంటుంది. ఆమధ్య జ్యోతిలక్ష్మీ చీరె కట్టిందంటూ పాట వచ్చేసి పాపులర్ అయిపోయినట్లు చీరెలో సితార అంటూ కాప్షన్‌తో రాతలు... చీరెలోని నా ఫోటోలు, విపరీతమైన నెగెటివ్ పబ్లిసిటీ జరుగుతుంది. దానితో నా కెరీర్ సరి..." భారంగా అంది సితార. చరితకి ఆమె మీద చాలా జాలి వేస్తూంది.

"సితారా!" ఆమె తల నిమురుతూ, ఆప్యాయంగా, ఆర్ద్రంగా పిలిచింది.

"ఊఁ"

"నీకు చీరె కట్టుకోవాలనుందా... శ్రీవారిని తెచ్చుకోవాలనుందా?"

"నేనూ ఆడదాన్నే. తారనైనా నేనూ స్త్రీనే. కొత్త చీరె కట్టుకోవాలనీ, వివాహం చేసుకోవాలనీ, అమ్మనవాలనీ - ఎందుకుండదు?" కళ్ళల్లోంచి నీళ్ళు జలజల రాలాయి.

"అయితే..." ఆమె కళ్ళు తుడుస్తూ అంది చరిత... నీ కీ కోరికలు అంత గాఢంగా ఉంటే - తెగించి - సినిమా రంగం వదిలేసి ... పెళ్ళి చేసుకోరాదూ?"

"నీకు తెలియదు - అదెంత అసాధ్యమో, అసంభవమో!"

"ఎందుకని?" నమ్మలేనట్లు చూసింది.

"అసాధ్యమే! అసంభవమే. రాక యుందును - వచ్చిన పోక యుందు - అనేది ఈ గ్లామరస్ సినీ రంగానికి అక్షరాలా సరిపోతుంది.

పద్మవ్యూహంలాంటి ఈ విషవలయంలోకి రావడమెంత కష్టమో, దీన్నుంచి బయటపడడం అంతకంటె వెయ్యి రెట్లు అసాధ్యం. దీని ఆకర్షణ అటువంటిది. ఈ ఆకర్షణ నుంచి బయటపడలేని బలహీనతే నాదీని. పైగా - నేను వేసే రోల్స్ కాబరే డాన్సర్ వంటివి. సౌందర్యాన్ని నగ్నంగా చూపేవి. మైకం కమ్మించేవి - మత్తెక్కించేవి - అంగడి బొమ్మలాటి ఈ పాత్రలు, వేషాలు వేసే నేను ఎందరికో వెర్రెక్కించగలిగే దానినే తప్ప ఎవరి హృదయంలోకీ చొరగలిగే దాన్ని కాదు. నీడను చూపించి నిజమని భ్రమింప జేస్తుంది సినిమా. వేషం చూసి మనిషీ అంతే అని నమ్ముతారు ప్రజలు. అందుచేత డాన్సులు చేస్తూ నగ్న సౌందర్యం ప్రదర్శించే నన్ను ఎవరూ వివాహమాడరు. తెరముందులాగే తెర వెనుకా నా శీలం కళంకితమనీ, నేను భార్యగా పనికి రాననీ ప్రజల అభిప్రాయం. అందుకే నాకు పెళ్ళి కాదు. ఎవరూ చేసుకోరు. కెమెరా ముందులాగే - కెమెరా వెనుకా - నేను నగ్నంగా ... బికినీలే తప్ప చీరెలు కట్టుకోకుండా, అంగడి బొమ్మలాగే తప్ప అర్ధాంగిని కాకుండా ... అందుకే - చీరె కట్టుకోవాలన్న కోరిక - నాకే నాటికీ తీరదు. అది - గగనకుసుమమే నా వంటి జీవితం గడిపే దానికి ..." భోరుమంది.

ఒక తార వెనుక ఇన్ని ఆరడులా? ఒక చీరె వెనుక ఇన్ని కట్టడులా? తార ... చీరె ... సితార ... ఆమె వెనుక మూడు వందల అరవై అయిదు కొత్త చీరెల - బీరువా; మినీ (బికినీ) లో సితార ... ఆమె వెనుక - వెక్కిరిస్తూ వందల కొద్దీ చీరెలు... చూస్తూ - ఏక్టర్ని కాబోయి డాక్టర్నైన నేనెంత అదృష్టవంతురాలిననుకుంది చరిత - తను కట్టుకున్న చీరెని చూసుకుంటూ, శ్రీవారినీ, పిల్లల్నీ తలుచుకుంటూ. ★



# కొత్తసీరియల్

రసవిద్యను సిద్ధింపజేసుకొనడానికి బయలుదేరిన శివాజీ గారు, శృంగారరసాన్ని మాత్రం మహాద్భుతంగా సిద్ధింపజేసుకోగలిగారు. మరి బంగారం కూడా తయారు చేశాడా? వేమన సాహిత్యం ఆయనకు దారి చూపిందా?

చివుకుల పురుషోత్తంగారి సృష్టి

# మహావేధ

త్వరలో ప్రారంభం